బలగం TV
BALAGAM
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 02 ఏప్రిల్ 2025 www.balagamtv.com పేజీలు 4


## రైతులకు ఈ దుస్థితి వస్తుందని ఊహించలేదు

- మాజీ సీఎం కేసీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ పాలన అంటేనే వింతైన పాలన అని, రాష్ట్రంలో మార్పు కోరుకున్న రైతుల కళ్లలో చివరికి కన్నీళ్లే మిగిలాయని కేసీఆర్ ఆరోపించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. పార్టీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్కతుర్తిలో బహిరంగ సభకు భూమి పూజ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సభకు వచ్చే జనానికి

మిగితా 2వ పేజీలో

# గుజరాత్‌లో భారీ అగ్ని ప్రమాదం

### బాణసంచా గోడౌన్‌లో పేలుడు..18 మంది మృతి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గుజరాత్?లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. బనస్కాంత జిల్లా దీసా పట్టణానికి సమీపంలో ఉన్న ఓ బాణసంచా తయారీ కర్మాగారంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. దీంతో గోడౌన్‌లో పని చేస్తోన్న 18 మంది మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి ఫ్యాక్టరీ కొంత మేర కూలిపోగా.. పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం. మరికొందరు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయంతో బయటకు పరుగులు పెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీమ్స్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది అతికష్టం మీద మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద చిక్కుకున్న కార్మికుల సహాయక బృందాలు చర్యలు చేపట్టాయి. పోలీసులు, ఇతర విభాగాల సిబ్బంది ఘటన స్థలంలోనే ఉండి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

బాధితులంతా మధ్యప్రదేశ్‌కు చెందిన శ్రామికులు. అది టపాసుల గిడ్డంగే తప్ప తయారుచేసే పరిశ్రమ కాదని పోలీసులు తెలిపారు. కాగా ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షలు, గాయపడిన వారికి రూ. 50వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఇదిలావుండగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కార్మికుల అకాల మృతిపై ఆవేదన వ్యక్తం చేశారు.గుజరాత్ అధికారులతో నిరంతర సంప్రదింపులో ఉన్నామన్నారు. బాధితులకు అన్ని విధాల సాయపడుతామని కూడా అన్నారు.

## ముగిసిన హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ వివాదం







**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మధ్య ఉప్పల్ స్టేడియం కాంప్లిమెంటరీ టిక్కెట్ల వివాదం సద్దుమణిగింది. ఇరువైపుల ప్రతినిధులు మంగళవారం సమావేశమయ్యారు. ఒప్పందం ప్రకారం 10 శాతం టిక్కెట్లు కేటాయిస్తామని సన్ రైజర్స్ హైదరాబాద్ స్పష్టం చేసింది.గతంలో మాదిరిగానే అన్ని కేటగిరీల్లో పాసులు ఇవ్వాలని హెచ్‌సీఏ కోరింది. సన్ రైజర్స్ హైదరాబాద్ సీఈవో షణ్ముగంతో ఇరువర్గాల ప్రతినిధులు టెలిఫోన్‌లో సంభాషించారు. టిక్కెట్ల కేటాయింపు యథావిధిగా కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. దీంతో టిక్కెట్ల వివాదానికి ముగింపు పలికినట్లయింది.

సమస్య పరిష్కారమైన అనంతరం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు స్పందించారు. తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం, సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం, హెచ్‌సీఏ ప్రతినిధులు వెంటనే స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టారని, వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన పోస్ట్ చేశారు. మనమందరం కలిసి ఉప్పల్‌లో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్ లను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# హెచ్‌సీయూలో

# ఒక్క అంగుళం భూమి కూడా తీసుకోలేదు

- 400 ఎకరాలు లాక్కొని వెంచర్లు, ప్లాట్లు చేస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న భూములను ఈ ప్రభుత్వం వెనక్కి తెచ్చింది
- 400 ఎకరాలు కాపాడి ఉద్యోగ, ఉపాధి కల్పించేలా కార్యాచరణను రూపొందిస్తున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- హెచ్‌సీయూ వద్ద ఉన్న జీవ వైవిధ్యాన్ని కాపాడుతాం ప్రభుత్వ పనులకు అడ్డు తగిలితే కఠిన చర్యలు
- మంత్రి శ్రీధర్ బాబు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి (హెచ్‌సీయూ) సంబంధించిన ఒక్క అంగుళం భూమిని కూడా ప్రజా ప్రభుత్వం తీసుకోలేదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతమైన రాష్ట్ర సంపదను న్యాయస్థానంలో పోరాడి విజయం సాధించి తిరిగి ప్రజలకు ఆస్తిగా ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిన 534.28 ఎకరాల భూమిని 2004 ఫిబ్రవరి 03న రెవిన్యూ అధికారులకు అప్పగించగా, వారు గోపన్ పల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 36 లో 191.36 ఎకరాలు సర్వేనెంబర్ 37 లో 205.20 ఎకరాలను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పగించి భూ బదలాయింపు చేసుకున్నారని తెలిపారు. భూ బదలాయింపు జరిగిన తర్వాత అప్పటి ప్రభుత్వం కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమిని బిల్లీ రావు ప్రాతినిధ్యం వహించిన ఐఎంజి ఫ్లోరిడాకు చెందిన ఐఎంజి భారత్ అనే క్రీడా నిర్వహణ సంస్థకు కేటాయించారని, ప్రభుత్వం ఒప్పందం మేరకు ఆ భూమిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకపోవడంతో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజా శ్రేయస్సుకు వ్యతిరేకంగా కోట్లాది విలువైన 400 ఎకరాల భూమిని ఐఎంజి భారత్ కు కేటాయించడాన్ని రద్దు చేశారని తెలిపారు.అప్పటి ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని ఐఎంజి భారత్ సవాల్ చేస్తూ హైకోర్టులో WP NO 24781 ద్వారా రిట్ పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. ఐఎంజి భారత్ వేసిన రిట్ పిటిషన్ పై అప్పటి ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డిలు న్యాయస్థానంలో అడ్వకేట్లు నియామకం చేసి ప్రభుత్వపరంగా వాదనలు వినిపించారని వివరించారు. మన వనరులు మనకే కావాలని, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం దశాబ్దాలుగా పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన గత పాలకులు ప్రైవేటు వ్యక్తి చేతుల్లో ఉన్న ఈ భూమిని ప్రభుత్వానికి తీసుకువచ్చే విషయాన్ని పట్టించుకోకపోగా గాలికి వదిలేశారని విమర్శించారు.

కోట్లాది విలువైన ఈ భూమి ప్రైవేటు వ్యక్తి చేతుల్లోనే ఉంట మరో రకంగా గత పాలకులు వారి చేతుల్లోకి తెచ్చుకోవాలనే కుట్రతోనే న్యాయస్థానంలో గట్టిగా కొట్లాడలేదన్నారు. ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో ఉన్న 400 ఎకరాల భూమి రాష్ట్ర సంపద, ప్రజల ఆస్తిగా భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా యావత్తు మంత్రి మండలి కూర్చొని చర్చించామన్నారు. ఎట్టి పరిస్థితిలో ఈ భూమి ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి పోనివ్వకుండా ప్రజలకు సంపద సృష్టించే ఆస్తిగా ఇవ్వాలని నిర్ణయం తీసుకొని న్యాయవాదులను నియామకం చేసి న్యాయస్థానంలో కొట్లాడి వేల కోట్ల విలువైన భూమిని రాష్ట్రానికి తీసుకొచ్చామని ఇది ప్రజల విజయమని అన్నారు.ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతమైన వేల కోట్ల విలువైన భూమిని కాపాడి ప్రజలకు ఆస్తిగా ఇచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని శభాష్ అని ప్రశంసించాల్సిన ప్రతిపక్షాలు విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. గత పాలకుల మాదిరిగా ప్రజా ప్రభుత్వం స్పందించకుంటే వేలాది కోట్ల విలువైన 400 ఎకరాల భూమి ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతం అయ్యి ఉండేది కాదా అని వారిని ప్రశ్నించారు.

ప్రైవేటు వ్యక్తి నుంచి తీసుకువచ్చిన భూమిని రాష్ట్ర ప్రజలకు ఆస్తిగా సృష్టించాలని, లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న తాపత్రయంతో రెవెన్యూ శాఖ నుంచి టీజీఐఐసీకి అప్పగించామే తప్ప ఇందులో ఎవరికీ ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదన్నారు. ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీ లో ఫేస్ 1, ఫేస్ 2కి పునాదులు వేయడం వల్లనే హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారడం వల్ల అనేక ఐటీ సంస్థలు నగరానికి వచ్చి కంపనీలు పెట్టడం వల్ల లక్షల మంది యువతకు ఉద్యోగాలు దొరికాయని తద్వారా హైదరాబాద్ మహానగరం అభివృద్ధి చెందిందన్నారు. అదే తరహాలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో సంపద సృష్టించడం యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలన్న ఆలోచనతో దాని అభివృద్ధి చేస్తున్నామే తప్ప ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి స్వార్థం లేదని వివరించారు. టీజీఐఐసీ తయారు చేసిన డ్రాఫ్ట్ లేఔట్ లో ఈ భూముల్లో ఉన్న న్యాచురల్ రాక్ ఫార్మేషన్స్, దాని లో భాగంగా మష్రుమ్ రాక్ ను కాపాడడానికి ప్రత్యేక చర్యలు గైకొనడంలో భాగంగా ఈ ప్రాంతాలను లే అవుట్ నుండి మినహాయించామని చెప్పారు.

పొల్యూషన్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ ఉండాలని పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రైవేటు వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతం కాకుండా పోరాటం చేసి కాపాడిన ఈ భూమిని ప్రజలకు ఆస్తిగా ఇవ్వడానికి ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని కొన్ని రాజకీయ పార్టీలు వారి మీడియా సంస్థల ద్వారా సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు అర్థం చేసుకొని తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు. కొంతమంది వ్యక్తుల ప్రయోజనాల కోసం రాష్ట్ర సంపదను తాకట్టు పెట్టమని ప్రజల ఆస్తిని వారి చేతుల్లోకి పోనివ్వమన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో తనకు వ్యక్తిగతంగా బాండింగ్ ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మరింత అభివృద్ధి చెందాలని అందుకు కావలసిన సహకారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, అక్కడ చదివిన ప్రతి విద్యార్థికి బయటకు రాగానే ఉద్యోగాలు రావాలని, మంచి భవిష్యత్తు ఉండాలని మా ప్రభుత్వం కోరుకుంటుందని చెప్పారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, 400 ఎకరాల భూమిని న్యాయపరంగానే తీసుకున్నామని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ వద్ద ఉన్న జీవ వైవిధ్యాన్ని కాపాడుతామని చెప్పారు. ప్రభుత్వ పనులకు అడ్డు తగిలితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోట్లాది రూపాయల భూములను ప్రైవేటు వ్యక్తుల నుంచి కాపాడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

## ఏప్రిల్ చివరి నాటికి బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఏప్రిల్ నెలాఖరు లోగానే భారతీయజనతా పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకొనే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. 13 రాష్ట్రాలలో సంస్థాగత ఎన్నికలు పూర్తయిన తర్వాత 13 రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల పేర్లను పార్టీ ప్రకటిస్తుందని బీజేపీ వర్గాలవారు తెలిపారు. పార్లమెంటు ప్రస్తుత సమావేశాలు ఈ నెల 4వ తేదీతో ముగుసిన వెంటనే అధికార బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇప్పటికే రాష్ట్రాలలో బీజేపీ సంస్థాగత ఎన్నికల కార్యక్రమం మొదలైంది. మార్చి 15 నాటికే ఈ ఎన్నికల ప్రక్రియపూర్తవుతుందని భావించినా, పార్లమెంటు సమావేశాల కారణంగా మరి కాస్త ఆలస్యం అయింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక దాదాపు పది నెలలుగా పెండింగ్ లో ఉన్న విషయం తెలిసిందే.

13 రాష్ట్రాలలో బిజేపీ సంస్థాగత ఎన్నికలు పూర్తయిన వెంటనే కొత్త అధ్యక్షులను ప్రకటిస్తారు. వచ్చే వారం లోనే ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల బిజేపీ అధ్యక్షుల పేర్లు ప్రకటిస్తారు. మొత్తం 19 రాష్ట్రాల పార్టీ అధ్యక్షుల పేర్లు ప్రకటించిన తర్వాత జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ మొదలవుతుంది. 2019నుంచి బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా జేపి నడ్డా ఉన్నారు. 2020 జనవరిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడుగా నడ్డా ఏకగ్రీవంగా ఎన్నికై, అమిత్ షా నుంచి బాధ్యతలు చేపట్టారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన పదవీ కాలాన్ని 2024 జూన్ వరకూ పొడిగించారు. నడ్డా కొత్త ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టిన తర్వాత , కొత్త అధ్యక్షుడి ఎన్నిక అనివార్యం అయింది. కొత్త అధ్యక్ష అభ్యర్థి కి ఆర్ఎస్ఎస్ ఆశీస్సులు తప్పని సరిగా ఉండాల్సి ఉంటుంది.

కాగా, ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఉన్న విషయం తెలిసిందే. 2020లో ఆయన బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఇక ఇటీవలే కేంద్రంలో ఎన్డీయే కూటమి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నడ్డాను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడితోపాటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిగానూ వ్యవహరిస్తున్నారు. ఇక పార్టీ చీఫ్ పదవీకాలం మూడు సంవత్సరాలే. దీంతో ఇటీవలే ఆయన పదవీకాలం ముగిసింది. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నడ్డా పదవీకాలాన్ని పొడిగించారు.



## జోగులాంబ అమ్మవారికి రూ.కోటి 60లక్షల బంగారు కిరీటం బహూకరణ!

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న తెలంగాణ రాష్ట్రం జోగులాంబ జిల్లా అలంపూర్ శ్రీ జోగులాంబ అమ్మవారికి బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగుల బృందం బంగారు కిరీటం బహుకరించారు. రూ.1కోటి 60,10,501ల విలువైన 1.587 కిలోల బంగారు కిరీటాన్ని సాఫ్ట్ వేర్ ఉద్యోగులు అమ్మవారికి బహుకరించారు. కిరీటంపై తేలు, గుడ్లగూబ, బల్లి, కపాలంతో ఉన్న ప్రతిమలు ఉన్నాయి. ఈ బంగారు కిరీటాన్ని ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ధర్మకర్తలకు అందించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. దాతలకు అమ్మవారి దర్శనం అనంతరం శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

## నేడు లోక్‌సభకు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు

- జేడీయూ మద్దతిస్తుందా..?
- ఇండియా కూటమి బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసే అవకాశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును నేడు కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. 542 మంది సభ్యులున్న లోక్‌సభలో వక్ఫ్ బిల్లు ఆమోదానికి కనీసం 272 మంది మద్దతు అవసరం. అధికార ఎన్డీయే కూటమికి కీలక పక్షం జేడీయూకు చెందిన 12 మంది సహా 293 మంది సభ్యులు ఉన్నారు. అలా చూసినప్పుడు ఎన్డీయే సులభంగానే బిల్లును ఆమోదించుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే.. ఈ బిల్లుపై జేడీయూలో తలో విధంగా మాట్లాతున్నారు. దీంతో జేడీయూ మద్దతు ఉంటుందా? లేదా? అన్న చర్చ ఊపందుకున్నది. జేడీయూ సీనియర్ నేత, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ వక్ఫ్ సవరణ బిల్లుకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. ఇది వక్ఫ్ బోర్డు పనితీరులో పారదర్శకత తీసుకురావడంలో కీలకంగా ఉంటుందని అంటున్నారు. అంతేకానీ.. ఇది ముస్లిం వ్యతిరేక బిల్లు కాదని చెబుతున్నారు. మరోవైపు జేడీయూ ఎమ్మెల్సీ గులాం గౌస్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది మైనార్టీల అవమానకరమైన బిల్లు అని తేల్చి చెబుతున్నారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ వంటి విధానాలతో బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మైనార్టీలను టార్గెట్ చేసిందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 'వక్ఫ్ సవరణ బిల్లును మొట్టమొదట వ్యతిరేకించిన వ్యక్తిని నేనే. ఈ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచీ కొన్నిసార్లు లవ్ జిహాద్, సీఏఏ, మూకుమ్మడి ఊచకోతలు, ట్రిపుల్ తలాఖ్, ఇప్పుడు ఇది. ఇది మా మతపరమైన అంశం. మా హక్కులను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు' అని పేర్కొన్నారు. జేడీయూ కనుక మద్దతు ఉపసంహరిస్తే ఎన్డీయే మెజార్టీ ప్రమాదంలో పడుతుంది. ఫలితంగా బిల్లుపై మరింత విస్తృతంగా చర్చ జరిగే అవకాశం ఉన్నది. లోక్‌సభలో 12 మంది సభ్యులు ఉన్న నేపథ్యంలో జేడీయూ వైఖరి అత్యంత కీలకం కానున్నది.

వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంలో రాజ్యసభ కూడా ఒక కీలక అంశంగా ఉంటుంది. 236 మంది సభ్యులున్న ఎగువ సభలో ఈ బిల్లు ఆమోదానికి కేంద్రం 119 మంది సభ్యుల మద్దతు సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎన్డీయేకు 123 మంది సభ్యులున్నారు. అంటే.. అవసరమైన మెజార్టీ కంటే ఎక్కువ మందితో ఎన్డీయే సానుకూల స్థితిలోనే ఉన్నది. కానీ.. మిత్రపక్షాల నుంచి ఏ మాత్రం ఇబ్బంది ఎదురైనా అధికార కూటమికి సవాలే.

ఇదిలా ఉండగా కూటమి పార్టీలు సమావేశమయ్యాయి. కాంగ్రెస్, శివసేన (యూబీటీ), సీపీఐ(ఎం) తదితర విపక్ష పార్టీల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. లోక్‌సభలో అనుసరించాల్సిన వ్యూహంపై వారు చర్చించారు. బిల్లుపై చర్చలో పాల్గొనాలని, అయితే బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన, విభజన ఎజెండాను ఓడించేందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా ఉన్నాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. పార్లమెంటులో విపక్షాలన్నీ కలిసి పనిచేస్తాయని ఆయన అన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ సహా వివిధ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి.

## హెచ్‌సీయూలో కొనసాగుతున్న నిరసన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని, విద్యార్థుల అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను కార్పొరేట్ శక్తులకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర కమిటీతో పాటు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కమిటీలు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు పెద్ద సంఖ్యలో యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట నిరసన చేపట్టారు. సీపీఐ(ఎం) బృందం నిరసనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల ప్రయత్నాలను ప్రతిఘటిస్తూ సీపీఐ(ఎం) నాయకులు విద్యార్థులను కలుసుకోవడానికి యూనివర్సిటీ వెలుపలికి చొచ్చుకుని పోయే ప్రయత్నం చేశారు. పోలీసు యంత్రాంగం తమ బలగాలను దింపి సీపీఐ(ఎం) నాయకులను అక్కడి నుంచి తరలించేందుకు యత్నించింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో నాయకులను లాక్కొని వెళ్లి పోలీసు వ్యాన్లలో ఎక్కించారు. వారు ప్రతిఘటించే క్రమంలో పోలీసులు చేయి చేసుకున్నారు. మహిళా నాయకులను నేలపై ఈడ్చుకెళ్లారు. అరెస్టు చేసిన వారిని గచ్చిబౌలి, నార్సింగి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

"యూనివర్సిటీ భూములు భవిష్యత్‌తరాలకు ఉపయోగపడేలా ఉండాలని, ఈ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించి యూనివర్సిటీ మూలాలను దెబ్బ తీయొద్దని .. శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు తమపై ఎందుకు దూరుసుగా

మిగితా 2వ పేజీలో

## విదేశీ యువతిపై లైంగికదాడి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

విదేశీ యువతిపై లైంగికదాడి జరిగిన దారుణ ఘటన రంగారెడ్డి జిల్లా పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం మహేశ్వరం జోన్ ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జర్మన్ దేశానికి చెందిన 22 ఏండ్ల యువతి, ఆమె స్నేహితుడు మిలన్ ఇద్దరూ కలిసి మార్చిలో హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో నివాసం ఉంటున్న వారి స్నేహితుడు శరత్ వద్దకు వచ్చారు. అందరూ కలిసి నగరంలోని పర్యాటక ప్రదేశాల్లో పర్యటించారు. అయితే, వరంగల్ జిల్లాలోని అతని బంధువులకు ఆరోగ్యం బాగాలేదని తెలిసి శరత్ సోమవారం అక్కడకు వెళ్లాడు. దాంతో యువతి, మిలన్ ఇద్దరూ కలిసి కొన్ని ప్రాంతాలను చూసి రావడానికి మీర్‌పేట్ పరిధిలో ఉన్న మంద మల్లమ్మ చౌరస్తా వద్దకు సోమవారం సాయంత్రం వెళ్లారు. అదే సమయంలో యాకత్‌పురాకు చెందిన అస్లాం అనే యువకుడు ఐదుగురు స్నేహితుల(మైనర్లు)తో కలిసి కారులో అక్కడకు వచ్చాడు. విదేశీ యువతిని చూసి హాయ్ అంటూ అస్లాం పలకరించగా.. వారు కూడా హాయ్ అన్నారు. అనంతరం అస్లాం ఆ యువతి, మిలన్ వివరాలు అడిగి తెలుసుకున్నాడు. పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్తానని వారిని కారులో ఎక్కించుకుని యాకత్‌పురా, చార్మినార్ తదితర ప్రాంతాల్లో తిప్పాడు. చివరకు పహాడిషరీఫ్ ప్రాంతం.. మామిడిపల్లిలోని గుట్టల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులను, మిలన్‌ను దింపి..ఇక్కడ ఫొటోలు తీసుకుంటూ ఉండండి అని చెప్పి యువతిని తీసుకుని అస్లాం కారులో ముందుకు వెళ్లి యువతిపై లైంగికదాడికి ఒడిగట్టాడు. తర్వాత యువతిని, ఆమె స్నేహితున్ని పహాడిషరీఫ్ ప్రధాన రహదారిపై వదిలి వెళ్లిపోయాడు. బాధిత యువతి తన స్నేహితుడితో కలిసి పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు ఏసీపీ తెలిపారు.

## అధిష్టానానికి జానారెడ్డి లేఖ

- ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలను క్యాబినెట్‌లోకి తీసుకోవాలని వినతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ కేబినెట్ విస్తరణ జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కే. జానారెడ్డి కాంగ్రెస్ హైకమాండ్ కు లేఖ రాయడం సంచలనంగా మారింది. కేబినెట్ విస్తరణలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలని మల్లిఖార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కే.సీ.వేణుగోపాల్ లకు లేఖలో విజ్ఞప్తి చేశారు. కేబినెట్ లో స్థానం కల్పించాలని ఆ జిల్లాల ఎమ్మెల్యేలు పార్టీ హైకమాండ్ కు చేసుకున్న విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించాలని జానారెడ్డి కోరారు. వారికి కేబినెట్ లో అవకాశం కల్పించే నిర్ణయం ప్రజల ప్రయోజనాలకు మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని జానారెడ్డి అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 14 స్థానాల్లో 4 స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారు. వారిలో మల్‌రెడ్డి రంగారెడ్డి (ఇబ్రహీంపట్నం), ప్రసాద్ కుమార్ (వికారాబాద్), రామ్మోహన్ రెడ్డి (పరిగి), మనోహర్ రెడ్డి (తాండూరు)లు ఉన్నారు.

# రాజకీయాలు నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు

● **యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రధాని నరేంద్రమోడీ వారసత్వం గురించి మహారాష్ట్ర అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన రాజకీయ జీవితంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని. పార్టీ నన్ను యూపీ ప్రజల కోసం నియమించింది.న అందుకే రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్నాను. ఇక పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు. వాస్తవానికి నేను ఒక యోగిని.' అని ఆయన పేర్కొన్నారు. ప్రతిపనికి ఒక కాలపరిమితి ఉంటుందని, అదే విధంగా తన రాజకీయ జీవితానికి కూడా పరిమితి ఉంటుందని అన్నారు. జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ హైకమాండ్‌తో తనకు విభేదాలు ఉన్నాయని వస్తున్న వార్తలను యోగి ఖండించారు. పార్టీ ఇచ్చిన అవకాశం వల్లే ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నానని, పార్టీ పెద్దలతో విభేదాలు ఉంటే ముఖ్యమంత్రి స్థానంలో కొనసాగేవాడిని కాదని అన్నారు. ఎవరో ఒకరు తప్పుడు ప్రచారాలు చేస్తూనే ఉంటారని, వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. ముస్లింలు హిందూయిజం నుంచి ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా క్రమశిక్షణను అలవరచుకోవాలని సూచించారు.

# హెచ్‌సీయూలో కొనసాగుతున్న నిరసన

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరిస్తున్నారని సీపీఐ(ఎం) నాయకులు ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆరుగ్యారంటీలతో పాటు.. అసెంబ్లీ సాక్షిగా చెప్పిన ఏడో గ్యారంటీ అయిన ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని పోలీసులను ఉపయోగించి ఎందుకు నిర్బంధిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలోకి వెళ్లకుండా పోలీసులు భయానక వాతావరణాన్ని సృష్టించడం సరికాదన్నారు. 144 సెక్షన్ పెట్టి ఎలాంటి నిరసనలు తెలియజేయకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. యూనివర్సిటీ భూములను, అడవులను.. బుల్డోజర్లను పంపి చదును చేస్తుంటే అక్కడ పక్షులు, జంతువులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందన్నారు. పర్యావరణానికి నష్టం కలిగించే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం యూనివర్సిటీకి చెందిన 400ఎకరాల భూమి వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్కడ 144 సెక్షన్, విద్యార్థులపై నమోదు చేసిన అక్రమ కేసులను రద్దు చేయాలన్నారు. ఇలాంటి నిర్బంధాల ద్వారా ఈ ఉద్యమాన్ని అణచివేస్తామనుకుంటే భవిష్యత్‌లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో పాటు పలు విద్యార్థి సంఘాలు నిరసనలు తెలిపాయి.

## విధ్వంసమే మీ ఏకైక నినాదం..

● **మాజీ మంత్రి కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వ్యవహారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తొలుత పర్యావరణ పరిరక్షణ పేరుతో చాలా మంది పేదల ఇండ్లను కూల్చివేశారని మండిపడ్డారు. ఆ తర్వాత అభివృద్ధి పేరుతో గిరిజన గ్రామాలను వెంబడించారని.. బంజరు భూములు, బల్లులు కూడా గుడ్లు పెట్టవు అన్నారని.. ఇప్పుడు మీరు జంతువుల గూళ్ళను వెంటాడి సామూహిక హత్యలు చేస్తారంటూ మండిపడ్డారు. మీ సమర్థన? అభివృద్ధా? ప్రభుత్వ భూమా? మీది ప్రభుత్వమా లేక బుల్డోజర్ కంపెనీనా?! మీరు ఎన్నికైన ప్రతినిధినా లేక రియల్ ఎస్టేట్ ఏజెంట్‌నా?! అంటూ ప్రశ్నించారు. విధ్వంసం మీ ఏకైక నినాదం! మీ ఖజానాను దాఖలు చేయడమే ఏకైక నినాదం! నేను మిమ్మల్ని అడుగుతున్నాను రేవంత్ రెడ్డి.. మీ బుల్డోజర్లు వారాంతంలో, రాత్రిపూట ఎందుకు నిరంతరాయంగా పనిచేశాయి? మీరు కోర్టుకు ఎందుకు భయపడుతున్నారు? మీరు ఏమి దాచారు? అంటూ తీవ్రస్థాయిలో స్పందించారు.

## చిన్నారి గుండె ఆపరేషన్‌కు కేటీఆర్ సాయం

**బలగం టీవి, హైదరాబాద్**

ఓ పెదింటి బిడ్డ గుండె ఆపరేషన్‌కు కేటీఆర్ సాయం అందించి పేద తల్లిదండ్రులకు భరోసాగా నిలిచారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపెల్లికి చెందిన ముక్క బాలరాజు– కల్పనా దంపతులకు భరత్ కుమార్ (5 నెలలు) కుమారుడు జన్మించగా పుట్టుకతోనే బాలుడికి గుండెకు రంధ్రం ఉందని అది చిన్నగా ఉందని మందులతో తగ్గుతుందని వైద్యులు తెలిపారు. మూడు నెలల వయసు వచ్చేసరికి రంధ్రం తగ్గకపోగా సమస్య పెద్దదై శ్వాస ఇబ్బంది ఏర్పడింది.దీంతో గత నెల 7 న హైదరాబాదులోని రెయిన్ బో హాస్పిటల్ కు తరలించారు. అక్కడ వైద్యులు ఆపరేషన్ కోసం రూ. 8 లక్షలు అవుతుందని చెప్పడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో బాలుడి తల్లికి బంధువైన అల్మాస్పూర్ కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ములిగే ప్రమోద్ కు తమ పరిస్థితిని తెలిపింది.వెంటనే ప్రమోద్ సదరు సమాచారాన్ని ఎమ్మెల్యే కేటీఆర్‌కు సమాచారాన్ని గత నెల 9న వాట్సాప్ ద్వారా అందజేశాడు. వెంటనే స్పందించిన కేటీఆర్ బాలుడి ఆపరేషన్‌కు సాయం అందించే ఏర్పాటు చేశాడు. బాలుడి ఆపరేషన్ పూర్తవడంతో ఇటీవల బాలుడి కుటుంబం స్వగ్రామం అక్కపెల్లికి చేరుకున్నారు. తమ కుమారుడు ఆపరేషన్ చేయించేందుకు సాయం అందించిన కేటీఆర్‌ను ఎప్పటికీ మరిచిపోలేమని బాలుడి తల్లిదండ్రులు కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి..

**-మహిళల, విద్యార్థినీల భద్రతకు భరోసా కల్పిస్తున్న జిల్లా షీ టీమ్.**

**- ఎస్పీ మహేష్ బి గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



విద్యార్థినులు,మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి గితే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని,వ ఖ్యంగా సామాజిక మాద్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని అన్నారు.మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని,మరేక్కడ్కెన ల్కెంగిక వేధింపులకు గురౌవుతున్న,ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు,విధ్యార్థునులు,బాలికలు మౌనంగా ఉండకుండా, ధ్కెర్యంగా పిర్యాదు చేయాలని,ఎవరైనా ఆకతయులు మహిళలను,యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థలల్లోఎవరైనా వేధించిన,రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100, జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

## విద్యార్థులను రెచ్చగొడుతున్నారు

**బలగం టీవి, హైదరాబాద్**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు విద్యార్థు లను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుం టున్నాయని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి మై హోం విహంగ వద్ద ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, విద్యార్థి నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కంచే గచ్చిబౌలిలో సర్వే 25లో 2004 లో 534 ఎకరాలు ప్రభుత్వానికి ఇస్తున్నట్టు హెచ్ సీయూ రిజిస్ట్రార్ సంతకం చేశారని, బదులుగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 397 ఎకరాలను హెచ్ సీయూకు ఇచ్చిందని తెలిపారు. 534 ఎకరాలలో 400 ఐఎంజీ భారత్ కు 120 ఎకరాలు టీఎన్జీవో ఉద్యోగ సంఘాలకు, ఇతరులకు కేటాయించారని అన్నారు. ఐఎంజీ భారత్ ఒప్పందం ప్రకారం వ్యవహరించలేదని, అందుకే భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళకుండా ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందన్నారు. సుప్రీం కోర్టు 400 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వానివే అని స్పష్టం చేసిందని, ఆ భూములు ముమ్మాటికి రాష్ట్ర ప్రభుత్వానివే అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే సర్వే నంబర్ 25లోని 25 ఎకరాల భూములను మై హోం విహంగ ప్రాజెక్ట్ కోసం రామేశ్వర్ రావుకు కట్టబెట్టారని, బీజేపీ నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు డబ్బుల మూటలు అందుకుని నోర్లు మెదపలేదన్నారు.



# రైతులకు ఈ దుస్థితి వస్తుందని ఊహించలేదు

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మార్పు కోరుకున్న రైతుల కళ్లల్లో కన్నీళ్లు మిగిలాయని ఆయన అన్నారు. రైతులకు ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని అన్నారు. ప్రభుత్వ చర్యలతో రైతులు, వివిధ వర్గాల ప్రజలు మనోధైర్యం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభరాష్ట్ర రాజకీయాలకు కీలకమైన మలుపునిస్తుందని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ సభలో ప్రజల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా బహిరంగ సభకు తరలివస్తారని, సభ విజయవంతం అయ్యేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని నేతలకు సూచించారు. అలాగే, వరంగల్ బహిరంగ సభ తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ కమిటీలు వేయాలని కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలిపారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం అనివార్యమని, ఇందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని గులాబీ బాస్ సూచించారు.

## బీజేపీ ఎమ్మెల్యేల అరెస్ట్

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయం నిర్ణయాన్ని వ్యతిరేకంగా యూనివర్సిటీ సందర్శనకు బయలుదేరిన బీజేపీ ఎమ్మెల్యేల బృందాన్ని పోలీసులు ఎమ్మెల్యేల క్వార్టర్స్ వద్దనే అడ్డగించి అరెస్టు చేశారు. బీజేపా శాసన సభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఉప నేత పాయల్ శంకర్ లతో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలను, నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీజేపీ ఎమ్మెల్యేలకు మధ్య వాగ్వివాదం, తోపులాటలతో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సెంట్రల్ యూనివర్సిటీ భూముల దగ్గరకు వెళ్లనివ్వకుండా బీజేపీ ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. గత కొంత కాలంగా సెంట్రల్ యూనివర్సిటీ భూములపై యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. యూనివర్సిటీ పరిధిలోని 400ఎకరాల భూముల అమ్మకం నిర్ణయాన్ని ప్రభుత్వ వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తుంది. మరోవైపు ఈ భూములు యూనివర్సిటీకి చెందినవి కావని ప్రభుత్వం స్పష్టం చేస్తుంది. ఆ భూములు యూనివర్సిటీవేనని వన్య ప్రాణులు, పక్షులు, జలవనరులు, వృక్ష సంపదతో జీవ వైవిధ్యానికి నెలవుగా ఉన్న వాటిని విక్రయించవద్దని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో ప్రవైటు కంపెనీకి కేటాయించిన ఈ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయపోరాటంతో స్వాధీనం చేసుకుందని కాంగ్రెస్ గుర్తు చేస్తుంది. గచ్చిబౌలి భూమి విషయంలో బీఆర్ఎస్ ద్వంద వైఖరి అనుసరిస్తుందని ఆరోపించింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదే హెచ్ సీయూకి 1700 ఎకరాల భూమి అవసరం లేదని కోర్టుకు పోయిందని, అందులో నుంచి కనీసం 160 ఎకరాల భూమి అభివృద్ధికి కావాలని కోర్టును కోరిందన్న సంగతి మరిచి నేడు రాజకీయం చేస్తుందని కాంగ్రెస్ విమర్శిస్తుంది.

## భారత్ వ్యవహారం అన్యాయంగా ఉంది

● **వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్**

**బలగం టీవి, హైదరాబాద్**



అమెరికా వ్యవసాయ వస్తువులపై భారతదేశం వంద శాతం సుంకాన్ని విధిస్తోందని, దీనివల్ల అమెరికా ఉత్పత్తులు కొన్ని విదేశీ మార్కెట్లకు చేరడం దాదాపు అసాధ్యంగా మారిందని వైట్ హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 2నుంచి అమెరికా వస్తువులపై పన్ను విధించే దేశాలపై పరస్పరం సుంకాలు అమలులోకి రానున్న నేపథ్యంలో వైట్ హౌస్ సోమవారం భారతదేశం వ్యవహారం అన్యాయంగా ఉందని పేర్కొంది.అధిక సుంకాలతో యుఎస్ ఎగుమతి దారులకు నష్టం కలిగిస్తున్న దేశాల జాబితాలో ఇండియాను చేర్చింది. ఇండియా అమెరికా ఉత్పత్తులపై 100 శాతం సుంకం విధింపువల్ల తీవ్రనష్టం జరుగుతోందని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ పేర్కొన్నారు. ఇక పరస్పర సుంకాల విధింపునకు సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. ప్రెసిడెంట్ ట్రంప్ బుధవారం చరిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారని వెల్లడించారు. చాలా దేశాలు అన్యాయమైన వాణిజ్య పద్ధతులు అనుసరిస్తున్నాయని ఆమె దుమ్మెత్తి పోశారు.యూరోపియన్ యూనియన్ నుండి అమెరికన్ పాల ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు, జపాన్ నుండి అమెరికన్ బియ్యంపై700 శాతం సుంకాలు మరియు కెనడా అమెరికన్ వెన్న,చీజ్‌పై దాదాపు 300 శాతం సుంకాలు. భారతదేశం అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులపై 100 శాతం సుంకం విధించడం వల్ల ఒత్తిడి మరింత పెరుగుతుంది అని లివిట్ అన్నారు.ఏప్రిల్ 2న పరస్పర సుంకాల విధింపు అతి పెద్ద గేమ్ ఛేంజర్ కాగలదని హెచ్చరించారు.



## కేంద్రీయ విద్యాలయం పాఠశాలకు బస్ ప్రారంభం

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**

సిరిసిల్ల పట్టణంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయ పాఠశాల(కేవీ స్కూల్)ని తంగళ్లపల్లి మండలం లోని పద్మనగర్ లో గల సొంత భవనంలోకి మార్చాగ విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు మంగళవారం సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుండి బస్ ని సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్ రావు కొబ్బరికాయ కొట్టి బస్‌ను ప్రారంబించారు.సుమారు 180 మంది విద్యార్థులు సిరిసిల్ల పట్టణం నుండి విద్యాభ్యాసం కోసం కేవీ పాఠశాల కు వెళ్లనున్నారు.ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.విద్యార్థుల కోసం మరో బస్ ని కూడా ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ప్రతి రోజు బస్ ఉదయం 7:30 నిమిషాలకి కొత్త బస్ స్టాండ్ నుండి ప్రారంభం అయ్యి పాత బస్టాండ్,గాంధీ చౌక్,పోలీస్ స్టేషన్ వద్ద విద్యార్థులను ఎక్కించుకొని వెళ్తుందని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు డిపో మేనేజర్ ని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్ వైజర్ వర్జిలాల్,కంట్రోలర్ రామ్ రెడ్డి,కార్గో డి.ఎం.ఈ శేఖర్ రావు,ఆర్. టి. సి సిబ్బంది మరియు విద్యార్థుల తల్లి దండ్రులు పెద్ది నవీన్ కుమార్,బండరాజు, కొండికొప్పుల రవి,తడుకల సురేష్,శ్రీనివాస్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటి శాఖ మంత్రికి అర్చకుల వినతి



**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ధూపదీప నైవేద్య అర్చకుల సమస్యల సాధనకై ఫ్యాక్స్ వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు ని కలిసి వినతి పత్రం సమర్పించారు.ధూప దీప నైవేద్య అర్చకుల సమస్యల సాధనకై ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, నెలవారి వేతనాలు సక్రమంగా అందించే విధంగా సహకరించాలని ఐటీ శాఖ మాత్యులను కోరారు.దీనిపై మంత్రి సానుకులంగా స్పందించి త్వరలో మీ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఇందులో జిల్లా అధ్యక్షులు శ్రీ రాచర్ల పార్థసారథి శర్మ, ప్రధాన కార్యదర్శి పరాంకుశం రమేష్, కోశాధికారి కె.వి. ఆర్ వెంకట రమణాచార్యులు,వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ళ రవికుమార్, ప్రచార కార్యదర్శి చర్లపల్లి సీతారాములు శర్మ, గౌరవ సలహా దారు సలహాదారు పారు నంది ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

### విద్యాలయాల

## భూములను అమ్ముకుంటామంటే బీజేపీ ఊరుకోదు




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ళ మహేందర్ ఆధ్వర్యంలో చలో హెచ్‌సీయూ కార్యక్రమానికి వెళ్లకుండా కోనరావుపేట మండల బీజేపీ నాయకులను అక్రమ అరెస్ట్ చేయడం సరికాదని బీజేవైఎం మండల అధ్యక్షులు చల్ల జితేందర్ రెడ్డి అన్నారు., భూములను కాపాడుకునేందుకు విద్యార్థులు పోరాటం చేస్తుంటే వారిపై లాఠీలు ఝుళిపించడాన్ని బీజేవైఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కనీసం ఆడపిల్లలు అని కూడా చూడకుండా పశువులను లాక్కెళ్లినట్టు లాక్కెళ్లిన రేవంత్ రెడ్డి సర్కార్ సిగ్గుతో తలదించుకోవాలన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా, బీజేవైఎం ఛలో హెచ్‌సీయూ కార్యక్రమాన్ని చేపడుతున్నది.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మదలచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు.. విశ్వవిద్యాలయాల భూముల అమ్మకాన్ని రేవంత్ రెడ్డి ఆపకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజీ,మండల ప్రధాన కార్యదర్శి భైరగోని సురేష్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు పొన్నం మహేష్ ఉన్నారు,

# సన్న బియ్యాన్ని సద్వినియోగించుకోవాలి

**-రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ దేశంలోనే ప్రథమం..**
**-అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా పథకాల అమలు**
**-మంత్రి పొన్నం ప్రభాకర్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా వివిధ పథకాలు అమలు చేస్తుందని,దాదాపు 60 వేల ఉద్యోగాలను తమ ప్రభుత్వం భర్తీ చేసిందని, రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ దేశంలోనే ప్రథమమని రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద ఉన్న రేషన్ దుకాణంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోని రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది రోజున



ప్రారంభించారని,ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 17,263 రేషన్ దుకాణాల్లో రెండు లక్షల 91 కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నామని, ప్రతి లబ్ధిదారుడు సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళల అందరికీ ఉచితంగా బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు,రూ. 500 కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. మహిళా మణులను కోటీశ్వరులుగా చేయాలని సదుద్దేశంతో ఇప్పటికే ఇందిరా మహిళా శక్తి కింద వివిధ యూనిట్లు ప్రారంభించామని అన్నారు. అలాగే సోలార్ యూనిట్లు మహిళా సంఘాలకు బస్సులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. సన్న ధాన్యం పండించే రైతులకు క్వింటాల్కు అదనంగా 500 అందజేస్తూ ప్రోత్సహిస్తున్నా మని, ఆర్టీసీకి నూతన బస్సులు అందజేస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందజేస్తు న్నామని అన్నారు.

**జిల్లాలోని 345 రేషన్ దుకాణాలు ద్వారా..**

రాష్ట్ర ప్రభుత్వం సోషియో ఎకనామిక్ సర్వే ను ఇటీవల నిర్వహించిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదించిందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని నేత కార్మికులకు భరోసా కల్పిస్తూ గత బకాయిలను విడుదల చేసిందని, అలాగే యార్న్ బ్యాంకును ప్రారంభించిందని వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతుం దని అన్నారు. దాదాపు 20వేల కోట్ల రూపా యల రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని అన్నారు. త్వరలో పెన్షన్ పంపిణీ ఇతర కార్యక్రమాలను ప్రారంభించనున్నామని, ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేరు స్తుందని ప్రకటించారు. జిల్లాలోని 345 రేషన్ దుకాణాలు ద్వారా లక్ష 70 వేల రేషన్ కార్డుల లబ్ధిదారులకు 3275 మెట్రిక్ టన్నులు పంపిణీ చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారా యణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప, అదరపు కలెక్టర్ భీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, జిల్లా పౌర సరఫ రాల అధికారి వసంత లక్ష్మి పౌర సరఫరాల మేనేజర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

# పేదవారి కళ్ళలో ఆనందం చూడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, వేములవాడ**

పేదవారి కళ్ళలో ఆనందం చూడడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న ఉచిత సన్నబియ్యం పథకాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు అందించే దొడ్డు బియ్యానికి బదులు సన్నబియ్యం అందించాలని ఒక దృఢ సంకల్పంతో రాష్ట్రంలో మేనిఫెస్టోలో చెప్పకుండా ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో మొట్టమొదటి సరిగా నర్సింగాపూర్ గ్రామంలో అమలు చేయడం జరిగిందని, ఆనాడు ప్రజాపాలన పథకాన్ని కూడా మొట్టమొదలు నర్సింగాపూర్ గ్రామంలో ప్రారంభించమని అన్నారు..

గతంలో దొడ్డు బియ్యం మెత్తగా ఉంటుందని మధ్య దళారులకు అమ్మి వారు దానిని రీసైక్లింగ్ చేసి మళ్లీ మనకు అమ్మాయి పరిస్థితి ఉండేది అన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ పరిస్థితులన్నీ చూసి పేద ప్రజలందరికీ ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు పై దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఆరు కిలోల సన్నంబి అని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు...

దేశంలో పేద ప్రజలకు ఉపయోగపడే ప్రతి ఒక్క పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రారంభించేసిందని, ఉపాధి హామీ పథకాన్ని, గరీబి హటావో, ఇందిరమ్మ ఇల్లు, భూములేని వారికి పోడు భూములు, బ్యాంకుల జాతీయకరణ లాంటి అనేక సంక్షేమ పథకాలను పేదవారి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఎన్ని పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు తీసుకున్న వాటన్నింటినీ కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ మాత్రమే ప్రారంభించిందని అన్నారు..ఆనాడు స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో 15 వేల గ్రామాల్లో మాత్రమే కరెంటు సదుపాయం ఉండగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నేడు ప్రతి ఇంటికి కరెంటును అందించడం జరిగిందని అన్నారు.. రైతులను రాజుగా చేయాలని ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత కరెంటు ప్రారంభించారని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు..

మన ప్రాంతంలో ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మల్యాల ప్రాంతానికి తీసుకువచ్చి 1737 కోట్లతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పనులను ప్రారంభించడం జరిగిందని,ఆనాటి నుండి గత పాలకులు మన ప్రాంత ప్రాజెక్టులను పడవ పడేలా చేశారని, గతంలో రుద్రంగి చందుర్తి ఫజుల్ నగర్ ప్రాజెక్టులను 2009 పూర్వమే పూర్తి చేశామనిఅన్నారు..మీ దీవెనల వల్ల ఎమ్మెల్యేగా గెలిచి ప్రభుత్వము వచ్చాక మళ్ళీ కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్, మర్రిపల్లి రిజర్వాయర్ పనులను ముమ్మరంగా కొనసాగుతున్నయని, సనుగుల దగ్గర లచ్చపేట తండకు వెళ్లే కాలువ పనులు, ఎర్ర చెరువు పటేల్ చెరువు, అసిరెడ్డిపల్లి కొచ్చేరుకు నీటిని తీసుకువచ్చే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు...

గతంలో రోడ్డు ఎక్కితే గాని రైతన్నకి నీటిని విడుదల చేసే పరిస్థితి ఉందని కానీ ప్రజా ప్రభుత్వంలో రైతు అడగకముందే నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని బీసీ కులగణన చేసి బీసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని అలాగే 30 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ చేయడం జరిగిందని ఈ రెండు చారిత్రాత్మక బిల్లులో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని

# 2027 వన్డే వరల్డ్ కప్ ఆడతాను

**టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కీలక ప్రకటన**

బలగం టీవి, హైదరాబాద్



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కీలక ప్రకటన చేశారు. 2027 వన్డే వరల్డ్ కప్ ఆడతానని స్పష్టం చేశాడు. గుజరాత్ టైటాన్స్ తో మ్యాచ్ కు ముందు ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో విరాట్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోస్ట్ ప్రశ్నిస్తూ మీ నెక్స్ట్ బిగ్ స్టెప్ ఏంటి అని అడిగారు. దానికి కోహ్లీ స్పందిస్తూ.. "తదుపరి బిగ్ స్టెప్ గురించి ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ వరల్డ్ కప్ గెలవడానికి తప్పకుండా ప్రయత్నిస్తాం". అని కోహ్లీ అన్నాడు. దీంతో అక్కడ ఉన్న ప్రేక్షకులు గట్టిగా చప్పట్లు కొడుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

వన్డే ప్రపంచ కప్ 2027 లో జరుగుతుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఈ టోర్నీకి ఆతిథ్యమిస్తున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ పై ఊహాగానాలు వచ్చాయి. అయితే వాటిలో నిజం లేదని కోహ్లీ స్పష్టం చేశాడు.

## కొత్త కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించనున్న బీసీసీఐ

బలగం టీవి, హైదరాబాద్



భారత పురుషుల క్రికెట్ జట్టు ఆటగాళ్ళ కోసం బీసీసీఐ కొత్త కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించనుంది. ఈ మేరకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే టీ20 అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నప్పటికీ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను టాప్ గ్రేడ్‌లోనే ఉంచుతారా లేదనే విషయంపై స్పష్టత రానుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ గొప్ప ఆటగాళ్లని, వారికి తగిన గౌరవం అందించేందుకు బీసీసీఐ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. అంటే బీసీసీఐ నుంచి ప్రతి సంవత్సరం రూ.7 కోట్లు అందుకుంటారు.

ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు(243) చేసిన శ్రేయాస్ అయ్యర్ కూడా బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ పొందుతున్నాడు. గత సంవత్సరం కొన్ని ఉల్లంఘనలకు పాల్పడినట్లు భావించి అయ్యర్‌ని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తొలగించారు. అయితే ఆ తర్వాత కాలంలో అయ్యర్ సత్తా చాటాడు. ఈ సీజన్‌లో ముంబై తరపున రంజీల్లో ఐదు మ్యాచుల్లో 68.57 యావరేజ్, 90.22 స్ట్రైక్ రేట్‌తో 480 పరుగులు చేశాడు. సయ్యద్‌ముస్తాక్ అలీ ట్రోఫీలో తొమ్మిది మ్యాచుల్లో 345 పరుగులు, విజయ్‌హజారే ట్రోఫీలో ఐదు మ్యాచుల్లో 325 రన్స్ చేశాడు. అయ్యర్ %ూ% గ్రేడ్ పొందే అవకాశం ఉందని సమాచారం. ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ తన కాంట్రాక్ట్ గ్రేడ్‌లో పదోన్నతి పొందే అవకాశం ఉంది.

బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ గురించి మాట్లాడుకుంటే, అందులో 4 రకాలు ఉన్నాయి. ఇందులో భారత ఆటగాళ్లను A+, A, B, C వర్గాలుగా విభజించనున్నారు. ఇందులో, A+ కేటగిరీ ఆటగాళ్లకు ఏటా రూ. 7 కోట్లు ఇస్తారు. అయితే ఏ కేటగిరీ ఆటగాళ్లకు ఏటా రూ. 5 కోట్లు లభిస్తాయి. ఇక మిగిలిన బి, సి కేటగిరీ ఆటగాళ్లకు ఏటా రూ.3 నుంచి రూ.1 కోటి చొప్పున ఇస్తారు.




**ఓటీటీలోకి**

## ‘జాబిలమ్మా నీకు అంత కోపమా’

బలగం టీవి, హైదరాబాద్

తమిళ నటుడు ధనుష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జాబిలమ్మ నీకు అంత కోపమా'. మలయాళ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్, అనిఖా సురేంద్రన్ ఈ సినిమాలో హీరోయిన్లుగా నటించగా ధనుష్ మేనల్లుడు పవిష్, మాథ్యూ థామస్ కథానాయకులుగా నటించారు. వండర్‌బార్ బ్యానర్‌పై ఈ సినిమాను కస్తూరి రాజా, విజయలక్ష్మి నిర్మించగా.. వెంకటేష్ మీనన్, రబియా ఖాటూన్, రమ్య రంగనాథన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాలో గోల్డెన్ స్పారో పాట పెద్ద హిట్టయిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా తమిళ వెర్షన్ ఇప్పటికే ఓటీటీ వేదిక 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో అందుబాటులోకి రాగా.. తెలుగు వెర్షన్‌ని మాత్రం సింప్లీ సౌత్ అనే ఓటీటీ కొనుగోలు చేసింది. అయితే ఈ ఓటీటీ తెలుగులో ఎవరికి తెలవకపోవడంతో తాజాగా మళ్లీ తెలుగు వెర్షన్‌ని కూడా అమెజాన్ ప్రైమ్ విడుదల చేసింది. ప్రస్తుతం ఈ సినిమా తెలుగు వెర్షన్ కూడా ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి వచ్చేసింది.

# పంజాబ్ రెండో గెలుపు

- 8 వికెట్ల తేడాతో లక్నోపై గెలుపు
- రాణించిన ప్రభ్ సిమ్రన్ సింగ్

బలగం టీవి, హైదరాబాద్



ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. మంగళవారం లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుత విజయం సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్‌ను వారి సొంత గడ్డపై చిత్తు చేస్తూ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది.

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. యువ బ్యాటర్లు ఆయుష్ బదోని(33 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 41), అబ్దుల్ సమద్(12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 27) తో పాటు నికోలస్ పూరన్(30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44)రాణించారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(2/39) రెండు వికెట్లు తీయగా.. లాకీ ఫెర్గూసన్, గ్లేన్ మ్యాక్స్‌వెల్, మార్కో జాన్సెన్, యుజ్వేంద్ర చాహల్ తలో వికెట్ తీసారు.



అనంతరం పంజాబ్ కింగ్స్ 16.2 ఓవర్లలోనే 2 వికెట్లకు 177 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్(34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 69), శ్రేయస్ అయ్యర్(30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. నెహాల్ వధేరా(25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 43 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. లక్నో బౌలర్లలో దిగ్వేష్ రతి(2/30) రెండు వికెట్లు తీసాడు. పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఈ గెలుపుతో పంజాబ్ కింగ్స్ పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానంలో నిలిచింది.

ప్రభ్‌సిమ్రాన్ సింగ్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 69 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 52, నేహల్ వధేరా 42 పరుగులతో రాణించడంతో పంజాబ్ 16.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

## దమ్మంటే నా సినిమాలను బ్యాన్ చేయండి

- **నిర్మాత నాగవంశీ**

బలగం టీవి, హైదరాబాద్



ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ నిర్మాణంలో వచ్చిన తాజా చిత్రం మ్యాడ్ స్క్వేర్. ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే పలు వెబ్‌సైట్‌లలో ఈ సినిమాకు నెగిటివ్ రివ్యూలు వచ్చాయి. దీంతో తాజాగా ప్రెస్ మీట్ పెట్టిన నాగవంశీ.. మీడియా జర్నలిస్ట్‌లతో పాటు రివ్యూలు ఇచ్చే పలు వెబ్‌సైట్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. సినిమా హిట్ టాక్ తెచ్చుకున్నా కూడా దాన్ని ఎందుకు ప్రోత్సహించరని ప్రశ్నించారు. సినిమా రిలీజ్ తర్వాత రివ్యూలు వచ్చాయి. అప్పుడు ప్రెస్ మీట్ పెట్టాను కానీ నేను ఏమీ మాట్లాడలేదు. ఎందుకంటే వాళ్ల పని వాళ్లు చేశారు అనుకున్నాను. సినిమా బాగా ఆడుతున్నప్పటికీ ఆ రివ్యూల మీద సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. కంటెంట్ లేకపోయినా సీక్వెల్ కాబట్టి ఆడుతోందని అంటున్నారు... కానీ 'మ్యాడ్ స్క్వేర్' బాగుంది కాబట్టి చూస్తున్నారు వేరే మూవీలు బాగోలేవని దీన్ని చూడటం లేదన్నారు. మీడియా మేమూ కలిసి పనిచేయాలి. నేను సినిమాలు తీసి విడుదల చేస్తేనే మీ వెబ్‌సైట్స్ రన్ అవుతున్నాయని అన్నారు. నేను ఇంటర్వ్యూలు ఇస్తేనే మీ యూట్యూబ్ ఛానళ్ల పనిచేస్తున్నాయని, మేము ప్రకటనలు ఇస్తేనే మీ సైట్స్ పనిచేస్తాయని తెలిపారు. దమ్ముంటే నా సినిమాలు బ్యాన్ చేసి చూపించండి. నా సినిమా ఆర్టికల్స్ రాయకండి. నా సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో నాకు బాగా తెలుసని నాగవంశీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హిట్-3' నుంచి నాని కొత్త లుక్

బలగం టీవి, హైదరాబాద్




నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శైలేష్ కొలను కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. మే 1న ఈ చిత్రం విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ మూవీపై అంచనాలను భారీగా పెంచేశాయి. తాజాగా ఈ సినిమాకి సంబంధించి సోషల్ మీడియా వేదికగా నాని మరో కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో చేతిలో స్టైలిష్‌గా గన్ పట్టుకుని సిగరెట్ కాలుస్తూ నాని ఊరమాస్ లుక్‌లో క్రేజీగా కనిపిస్తున్నాడు. ఈ పోస్టర్‌కు 'లోడెడ్ అండ్ కుక్డ్' అంటూ క్యాప్షన్ ఇచ్చి, మరో 30 రోజుల్లో హిట్-3 వస్తుందని పేర్కొన్నారు. ఇక ఈ సినిమాలో శైలేష్ కొలను హీరో నానిని విభిన్నంగా చూపించబోతున్నారు. ఇప్పటికే కశ్మీర్ ప్రాంతంలో కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. ఇందులో నాని పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో కనిపించనున్నారు. నాని సొంత బ్యానర్ వాల్‌పోస్టర్ సినిమాతో కలిసి యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది.

## చిరంజీవి-అనిల్ మూవీ టీమ్ స్పెషల్ వీడియో

బలగం టీవి, హైదరాబాద్




మెగాస్టార్ చిరంజీవి- అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మెగా 157' వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా ఉగాది రోజు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. తాజాగా ఈ సినిమా కోసం వర్క్ చేయనున్న వారి వివరాలను మూవీటీమ్ వెల్లడించింది. ఇందుకోసం ఓ స్పెషల్ వీడియో రిలీజ్ చేసింది. ఈ సినిమా కోసం పని చేయనున్న టీమ్ మెంబర్లను పరిచయం చేశారు. అందులో చిరంజీవి ఇప్పటి వరకూ నటించిన సినిమాల్లోని పాత్రలను చెబుతూ ఒక్కొక్కరు వారు చేయనున్న వర్క్‌ను వివరించారు. 2026 సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు. 'ఈ సంక్రాంతికి రఫ్ఫాడించేద్దాం' అంటూ వీడియో చివర్లో చిరంజీవి చెప్పిన డైలాగ్ అదిరిపోయింది. షైన్ స్క్రీన్, గోల్డ్ బాక్స్ ఎంటర్ టైన్ మెంట్ సంస్థ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మాతలు వ్యవహరిస్తున్నారు.